క్లుప్తంగా

పౌర గ్రంథాలయానికి వేద గ్రంథాల బహూకరణ



గ్రంథాలు అందజేస్తున్న ప్రొఫెసర్ హరినారాయణ

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయాన్ని శుక్రవారం గీతం ప్రొఫెసర్ డి.హరినారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా లైబ్రరీకి విలువైన వేద గ్రంథాలను బహూకరించారు. రుగ్వేదం 12 భాగాలు, యజుర్వేదం 3 భాగాలు, సామవేదం 2 భాగాలు, అధర్వణ వేదం 5 భాగాలు మొత్తం 22 పుస్తకాలను గ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మకు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు టి.శ్రీనివాస్, ప్రయాగ సుబ్రహ్మణ్యం, లైబ్రేరియన్ దుర్గారాణి పాల్గొన్నారు.

రోడ్లు తవ్వేయడంతో ఇబ్బందులు



దొండపర్తిలో తవ్వి వదిలేసిన రహదారి

తాటిచెట్లపాలెం: ఇటీవల పైప్‌లైన్ పనుల నిమిత్తం రోడ్లు తవ్వేసి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దొండపర్తి బజాజ్ షోరూం ఎదురుగా గల రహదారిలో పైప్‌లైన్ కోసం తవ్వి పూరించకుండా వదిలేశారు. దీంతో స్థానికులు కొద్ది రోజులుగా ఇబ్బందులకు గురవుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి తక్షణం పనులు పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింప జేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం కంకణ, దారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాల ఘట్టంతో కల్యాణం జరిపారు.

నేడు, రేపు టాలెంట్ వార్ పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహ్మద్ షకీల్

దాబాగార్డెన్స్: మిరాకిల్ ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 6,7 తేదీల్లో టాలెంట్ వార్ పేరిట ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ తెలిపారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో శుక్రవారం పోటీల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యం, వెస్ట్రన్ డ్యాన్స్, సినిమా పాటలు, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్, పెద్దలకు వస్త్రాలంకరణ పోటీలు ఉంటాయన్నారు. అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చని చెప్పారు. పౌర గ్రంథాలయం వేదికగా 6వ తేదీ సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు, 7వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయన్నారు. పాల్గొనదలచిన వారు 99664 85335, 95533 33134 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



ఉద్యానవనంలో ఆధునికీకరించిన పాత్‌వే



సుదర్శన్ పార్కులో పచ్చదనం



మురళీనగర్ సెక్టార్-4లో సుదర్శన్ పార్కు

ఉద్యానవనం.. హరిత శోభితం

- ఆధునిక అందాలతో మెరిసిపోతున్న మురళీనగర్ సుదర్శన్ పార్క్
- జీవీఎంసీ నిధులు, కమిటీ సభ్యుల విరాళాలతో అభివృద్ధి



పార్కులో ధ్యాన మందిరం

మురళీనగర్: మురళీనగర్‌లో సెక్టార్-4లోని సుదర్శన్ పార్క్.. జీవీఎంసీ నిధుల సహకారంతో నిర్వహించిన అభివృద్ధి పనులతో మెరిసిపోతోంది. ఇది కొత్త అందాలను సంతరించుకుని సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఏడాది కిందట వరకు అస్తవ్యస్తంగా ఉన్న ఈ పార్కును నేడు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడంతో నూతనత్వాన్ని సంతరించుకుంది.

వాకర్స్ పార్కు తర్వాత..

మురళీనగర్‌లో మొత్తం 8 పార్కులు ఉండగా.. వీటిలో వాకర్స్ పార్కును మొట్టమొదట ఏర్పాటు చేశారు. దాని తర్వాత సుదర్శన్ పార్కును 2,500 చదరపు గజాల్లో 1997లో ఏర్పాటు చేశారు. సబ్బం హరి మేయర్‌గా ఉన్న కాలంలో ఆయన మొక్కలు నాటి దీన్ని ప్రారంభించారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ విద్యాసాగర్ వీరి ఆసక్తికి ముగ్ధుడై మూడు నెలల్లో ఫుట్‌పాత్, లైటింగ్, బెంచీలు, పంప్ హౌస్ అండ్ మోటార్ ఏర్పాటు చేయించారు. ఆ తర్వాత కమిషనర్ సంజయ్‌జాజు సహకారంతో 2005లో ధ్యాన మందిరం నిర్మించారు. దీనికి జీవీఎంసీ రూ.4.75 లక్షలు మంజూరు చేయగా.. స్థానిక దాత పూర్ణచంద్రరావు రూ.2 లక్షల విరాళం అందించారు. రెండు అంతస్తులు, పైన పిరమిడ్ నిర్మించారు. పైప్‌లైన్స్, రెండు షాపుల నిర్మాణానికి మొత్తం రూ.8.50 లక్షలు ఖర్చు చేశారు.

శాశ్వత ఆదాయం

పార్కు నిర్వహణ కష్టమవుతున్న తరుణంలో అప్పటి కమిషనర్ ఆలోచన మేరకు శాశ్వత ఆదాయ వనరులు సమకూర్చాలని నిర్ణయించారు. తద్వారా పార్కు నిర్వహణ సక్రమంగా నిర్వహించే ప్రణాళికలో భాగంగా ఈ పార్కులో భవనానికి అనుబంధంగా రెండు షాపులు నిర్మించారు. మొట్టమొదటి సారిగా ఇక్కడ ఈ విధానం అమలు చేసి విజయవంతం కావడంతో నగరంలోని ఇతర పార్కులకు ఇదే విధానాన్ని అమలు చేశారు. దీంతో పార్కు నిర్వహణ భారం స్థానికులకు తప్పింది. నగరంలో మొట్టమొదటి ధ్యాన మందిరం కూడా ఇక్కడే నిర్మించారు.

రూ.19.50 లక్షలతో అభివృద్ధి

ఇటీవల ఈ పార్కులో రూ.19.50 లక్షల జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో దీన్ని అందంగా తీర్చిదిద్దారు. నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఎ.వీరబాబు, కార్యదర్శి ఎం.ఆర్.కె.రంగారావు, ఇతర కార్యవర్గ సభ్యుల పర్యవేక్షణలో పార్కును అభివృద్ధి చేశారు. ఓపెన్ జిమ్ పరికరాలు, పిల్లల ఆట పరికరాలు, పాత్‌వే విస్తరణ, ఆధునికీకరణ, ప్రహరీ గోడకు రంగులు, కెర్బ్‌వాల్స్ నిర్మాణ పనులు జరిగాయి. స్కైవాక్, చెస్ట్ ఎక్స్‌పాన్షన్, ట్విస్టింగ్ పరికరం, స్టమక్ ఎక్సర్‌సైజ్ వంటి ఆరు రకాల జిమ్ పరికరాలు, చిన్నారులు ఆడుకోవడానికి జారుడుబల్ల, ఉయ్యాల, జాలీగో, ఆర్చ్, స్వింగింగ్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇవి కాకుండా పార్కు కమిటీ సభ్యులు రూ.66 వేల విరాళంతో శాశ్వత పనులు పూర్తి చేశారు. బెంచీలను మార్చి వాటికి కాంక్రీట్ పేవ్‌మెంట్, పార్కు నేమ్ బోర్డు, కీపర్లకు స్టాండ్‌లు, శాండ్ కుషన్స్, పైపుల ఏర్పాటు, ఫ్లోర్ ఏరియా పెయింటింగ్ చేశారు.



పార్కులో జిమ్, ఆట పరికరాల వద్ద సందర్శకులు, చిన్నారుల సందడి

ఔషధ మొక్కల పెంపకం

పార్కులో ఔషధ మొక్కలు పెంచుతున్నారు. క్యాన్సర్ నివారణకు ఉపయోగపడే లక్ష్మీ తరువు, వేప, నేరేడు, మారేడు, రావి, మామిడి, గోరింట, లక్ష్మణ ఫలం, పారిజాత వృక్షం, తులసి, బాదం, కరివేపాకు, అంజీరా వంటి చెట్లు ఇక్కడ ఉన్నాయి.

సందర్శన వేళలు

పార్కు: ఉదయం 5.30 నుంచి 9.00 గంటలు, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటలు.

యోగా కేంద్రం: ఉదయం 5.30 - 7.30 గంటలు, సోమవారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలు.

సభ్యుల సహకారంతో అభివృద్ధి



సుదర్శన్ పార్కు సంఘం సభ్యులు, నివాసితుల సహకారంతో పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సభ్యులు ఇందుకు సహకారం అందిస్తున్నారు. పార్కులో దోమల నిర్మూలనకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. సందర్శకుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. పార్కులో క్యాన్సర్‌ను నివారించే లక్ష్మీ తరువు మొక్క కూడా ఉంది.

– ఎం.ఆర్.కె.రంగారావు, కార్యదర్శి, సుదర్శన్ పార్కు

ఆహ్లాదకరంగా పార్క్



సుదర్శన్ పార్కులో ఇటీవల నిర్వహించిన అభివృద్ధి పనుల కారణంగా కొత్త అందాలు సంతరించుకుంది. జీవీఎంసీ నిధుల మంజూరుకు కె.కె.రాజు సంపూర్ణ సహకారం అందించడం వల్ల ఇది సాధ్యమైంది. పరిశుభ్రత, పచ్చదనం పెంపునకు ప్రాధాన్యమిస్తున్నాం. మా సభ్యులు ఎప్పటికప్పుడు శ్రమదానం చేస్తూ పార్కు పరిశుభ్రతకు సహకరిస్తున్నారు.

– జె.పృథ్వీరాజ్, పార్కు కమిటీ సలహాదారుడు

గాంధీ పార్కులో అల్లూరి జయంతి



నినాదాలు చేస్తున్న కమిటీ సభ్యులు

సీతమ్మధార: జీవీఎంసీ గాంధీ పార్కులో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నాయకత్వంలో విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి ఎస్.గోవిందరాజులు మాట్లాడుతూ అల్లూరి నేటికీ జీవించి ఉంటే ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించేవారన్నారు. మానవ హక్కుల వేదిక నాయకుడు ఎం.శరత్ మాట్లాడుతూ ప్రకృతి వనరులు, దేశ సంపదను ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా చేసే పోరాటమే నిజమైన దేశ భక్తి అన్నారు. కార్యక్రమంలో పౌర చైతన్య వేదిక నాయకులు సి.హెచ్.ప్రమీల, కె.శివప్రసాద్, డాక్టర్ పొన్నాడ శ్రీనివాసరావు, కె.అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ: స్వచ్ఛత, వ్యాధులపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 39వ వార్డు క్వీన్‌మేరీ పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రత, వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకుంటే తల్లిదండ్రులకు తెలియపరుస్తారన్నారు. దీని వలన ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రం అవుతాయన్నారు. ఫలితంగా వ్యాధుల బారి నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ముఖ్యంగా ఇంట్లో నీరు నిల్వ లేకుండా చూసుకుంటే దోమలు లార్వాలు పెట్టకుండా ఉంటాయన్నారు. దోమలు వృద్ధి చెందకుంటే వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో జోన్ పరిధిలోని అన్ని పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యార్థులు వారి ఇళ్లతో పాటు వీధిలో అందరికీ అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



కంచరపాలెం: గొల్ల కంచరపాలెం దుర్గానగర్‌లో కొలువైన దుర్గమాంబ అమ్మవారి ఆలయంలో శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ అమ్మవారికి కుంకుమ పూజలు, పూలు, పంచామృతాభిషేకాలు జరిపారు. ఆలయ ఆవరణలో భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో కాలభైరవుడికి పూజలు



సీతమ్మధార: అమావాస్య సందర్భంగా సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో శుక్రవారం కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు చేశారు. భక్తులు నెయ్యి దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో స్వామిని పూజించారు. కాలభైరవ స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

జూనోసిస్ వ్యాధులపై అవగాహన



జూ సిబ్బందిని పరీక్షిస్తున్న ఏఎంసీ వైద్య సిబ్బంది

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూనోసిస్ వ్యాధుల గురించి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కళాశాల సహకారంతో వన్ వరల్డ్ వన్ హెల్త్, ప్రివెంట్ జూనోసిస్ పేరుతో జూనోసిస్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎ.కృష్ణవేణి పాల్గొని జూ యానిమల్ కీపర్లు, సందర్శకులకు జూనోసిస్ వ్యాధులు ఏవిధంగా సంక్రమిస్తాయి, వాటి నివారణ, ఆయా వ్యాధులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తదితర వాటి గురించి వివరించారు. అనంతరం జూ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. బీపీ, మధుమేహం, రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలరావు, జూ వైద్యుడు ఫణీంద్ర, సెక్షన్ ఆఫీసర్లు భారతి, రాజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలతో బెంబేలు

- జోన్–3 కార్యాలయ సెల్లార్‌లో తిష్ట
- భయాందోళనల్లో ఉద్యోగులు, సందర్శకులు



జోన్-3 కార్యాలయం సెల్లార్‌లో కుక్కను పడుతున్న జీవీఎంసీ వెటర్నరీ సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 కార్యాలయం సెల్లార్‌లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ సందర్శకులపై దాడులు చేస్తున్నాయి. వీటి బారిన పడి పలువురు గాయాల పాలయ్యారు. తాజాగా గురువారం ఒక వ్యక్తి జోనల్ కార్యాలయానికి వచ్చాడు. సెల్లార్‌లో కుక్కలు అతడిని కరవడంతో భయాందోళనలు చెంది పరుగులు తీశాడు. శుక్రవారం జోనల్ కార్యాలయం సెల్లార్‌లో కుక్కలను జీవీఎంసీ వెటర్నరీ సిబ్బంది పట్టుకున్నారు. అశోక్‌నగర్‌లో అర్ధరాత్రి దాటిన తరువాత వెళ్లే వారి శునకాలు వెంటపడి తరుముతున్నాయి. దీంతో రాత్రి పూట విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో కుక్కల అరుపులతో స్థానికులకు కంటి మీద కునుకు ఉండటం లేదు. పలు వీధుల్లో ఎక్కడో ఒక చోట కుక్క కాటుకు గురవుతున్నారు. గుంపులుగా స్వైర విహారం చేస్తుండటంతో రోడ్డు మీదకు వచ్చేందుకు జనం బెంబేలెత్తుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నైపుణ్యవంతమైన విద్యతో మెరుగైన అవకాశాలు

దాబాగార్డెన్స్ : నైపుణ్యంతో కూడిన విద్యనభ్యసిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. కళాశాల జేకేసీ, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా జెన్‌ప్యాక్ట్ పేరిట శుక్రవారం జాబ్ డ్రైవ్ నిర్వహించారు. పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జెన్‌ప్యాక్ట్ కంపెనీ సీనియర్ మేనేజర్లు సతీష్, శ్యాంసన్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ అధికారి రాజేష్ పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 256 మంది విద్యార్థులు పాల్గొనగా.. వీరిలో 70 మందిని ఎంపిక చేశారు. డి.అరుణ పద్మ, విద్యాకల్పన, హైమావతి, సంతోషి, అనూష, డాక్టర్ శరణ్య పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనే లక్ష్యం



బంగారుమెట్టలో స్థానికులకు ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

అల్లిపురం: డయేరియా నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి అన్నారు. డయేరియా నిర్మూలనే ధ్యేయంగా స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. అల్లిపురం మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలన డయేరియా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. వాటి నివారణకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన..

సీజనల్ వ్యాధులపై మలేరియా సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలోలో భాగంగా బంగారుమెట్టలో ఇంటింటికీ వెళ్లి మంచినీటి గోలాలు, పూల కుండీలలో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంచే డ్రమ్ములలో దోమ లార్వాలను గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులను నివారించ వచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరియా మలేరియా సిబ్బంది మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.